www.toliadugudaily.com
www.epaper.toliadugudaily.com

# తొలిఅడుగు

తెలుగు దిన పత్రిక

## అమిత్ షా దేశ దేశ ప్రజలకు వెంటనే క్షమాపణలు చెప్పాలి



3

హైదరాబాద్ | సంపుటి : 01 | సంచిక : 211 | బుధవారం | 25- 12 - 2024 | ఎడిటర్ : పి. జయరాం | పేజీలు : 8 | వెల : 4

# పెద్దతప్పు జరిగిపోయింది.!

- చిక్కడపల్లి ఠాణాలో అల్లు అర్జున్ భావోద్వేగం!
- ఉదయం 11:05 నుంచి మధ్యాహ్నం 2:45 దాకా విచారణ
- 20 ప్రశ్నలు..! ఒకట్రెండు తప్ప అన్నింటికీ జవాబు
- ఎప్పుడు పిలిచినా విచారణకు వస్తానని స్పష్టీకరణ
- ఠాణా వద్దకు భారీగా అభిమానులు.. స్వల్పఉద్రిక్తత







తొలిఅడుగు, హైదరాబాద్ : సంధ్య థియేటర్ వద్ద జరిగిన దుర్ఘటనకు తాను కారణం కాదని ఇన్నిరోజులుగా చెబుతున్న బన్నీ.. తనవల్ల పెద్ద తప్పు జరిగిపోయిందంటూ మంగళవారం పోలీసుల వద్ద విచారం వ్యక్తం చేశారు! తోపులాటలో కిందపడి అపస్మారకస్థితిలోకి వెళ్లిన రేవతి, శ్రీతేజ్‌ను బతికించడం కోసం పోలీసులు సీపీఆర్ చేసిన వీడియోని చూసి ఆయన కంటతడి పెట్టుకున్నారు. తొక్కిసలాటకు సంబంధించి పోలీసులు చూపిన 10 నిమిషాల వీడియో చూసి ఆయన భావోద్వేగానికి గురైనట్టు సమాచారం. 'పుష్ప-2' ప్రీమియర్ షో సందర్భంగా సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట కేసుకు సంబంధించి విచారణకు రావాలంటూ చిక్కడపల్లి పోలీసులు అల్లు అర్జున్‌కు నోటీసులిచ్చిన సంగతి తెలిసిందే. ఈమేరకు.. మంగళవారం ఉదయం 10.30 గంటలకు.. భార్య, కుమార్తె గేటుదాకా వచ్చి సాగనంపగా.. తండ్రి అల్లు అరవింద్, మామ

2

## జమ్మూకశ్మీర్‌లో ఘోర ప్రమాదం



తొలిఅడుగు, జమ్మూకశ్మీర్ : జమ్మూకశ్మీర్‌లోని పూంఛ్ జిల్లాలో ఘోర ప్రమాదం జరిగింది. జవాన్లతో వెళ్తున్న వాహనం అదుపుతప్పి లోయలో పడిపోయింది. దీంతో ఐదుగురు జవాన్లు ప్రాణాలు కోల్పోయారు. మరో ఎనిమిది మంది జవాన్లు తీవ్రంగా గాయపడ్డారు.

2

## ఫిబ్రవరి 1న కేంద్ర బడ్జెట్..



తొలిఅడుగు, న్యూఢిల్లీ : వచ్చే ఏడాది పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టనున్నది. బడ్జెట్‌కు సంబంధించి అభిప్రాయాలు, సూచనలను స్వీకరించేందుకు ప్రధాని నరేంద్ర మోదీ ఆర్థికవేత్తలు, నిపుణులతో సమావేశమయ్యారు. ఫిబ్రవరి 1న లోక్‌సభలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2025-26 బడ్జెట్‌ను పార్లమెంట్‌లో

2

## మంచులో చిక్కుకున్న వెయ్యి వాహనాలు



తొలిఅడుగు, న్యూఢిల్లీ : హిమాచల్ ప్రదేశ్‌లో భారీగా కురుస్తున్న తెల్లటి మంచు దుప్పటితో కష్టాలు పెరుగుతున్నాయి. విపరీతంగా కురుస్తున్న మంచు కారణంగా మనాలి, సోలాంగ్ నాలా, అటల్ టన్నెల్ మధ్య

2

## విజయవంతంగా వందే భారత్ స్లీపర్ ట్రయల్ రన్



తొలిఅడుగు, గ్వాలియర్: ఎన్నో రోజులుగా ఎదురుచూస్తున్న వందే భారత్ స్లీపర్ రైలు పట్టాలెక్కింది. అత్యాధునిక సౌకర్యాలతో కూడిన ప్యాసింజర్ ట్రెయిన్‌ను

2

## క్రైమ్ రేట్‌లో సైబర్‌బాద్!

### సైబర్ నేరాల కారణంగా 793 కోట్ల నష్టం




తొలిఅడుగు, హైదరాబాద్ : సైబరాబాద్‌లో నేరాలు భారీగా పెరిగాయి. నిరుటితో పోలిస్తే ఈసారి క్రైం రేట్ ఏకంగా 64 శాతం పెరిగి 14,830 కేసులు అధికంగా నమోదయ్యాయి. 2023లో 22,859 కేసులు నమోదు కాగా, ఈ ఏడాది 37,689 కేసులు నమోదయ్యాయి. అదే సమయంలో సైబర్ నేరాలలో 122 శాతం పెరుగుదల నమోదైంది. సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి మంగళవారం గచ్చిబౌలిలోని కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో 2024 వార్షిక నివేదిక విడుదల చేశారు. దీని ప్రకారం నేరాల పెరుగుదల

2

## సూరీడుని ముద్దాడిన పార్క



తొలిఅడుగు డెస్క్ : 2018లో పార్కర్ సోలార్ ప్రోబ్ మిషన్‌ను నాసా చేపట్టింది. ఇప్పటికే ఆ స్పేస్‌క్రాఫ్ట్ 21 సార్లు సూర్యుడిని చుట్టేసింది. అంటే, మొత్తంగా 14.9 కోట్ల కిలోమీటర్ల దూరం ప్రయాణించింది. గంటకు 6 లక్షల 92 వేల కిలోమీటర్ల వేగంతో పార్కర్ ప్రోబ్ ప్రయాణిస్తుంది. అంటే గన్ నుంచి వచ్చే బుల్లెట్ వేగం కంటే 200 రెట్లు

2

## ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం




తొలిఅడుగు, అమరావతి : ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వైసీపీ హయాంలో నియమితులైన ఫైబర్‌నెట్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న ఉద్యోగులు, సిబ్బందిలో తొలి విడతగా 410 మందిని తొలగించింది. మరో రెండు వందల మందిని తొలగించేందుకు రంగం సిద్ధం చేసుకుంది. ఈ సందర్భంగా ఫైబర్‌నెట్ చైర్మన్ జీవీ రెడ్డి మాట్లాడుతూ ఏపీ ఫైబర్‌నెట్‌ను ప్రక్షాళన చేస్తున్నామని వివరించారు.

2

## గొప్ప దేశభక్తులలో వాజ్‌పేయి ఒకరు



తొలిఅడుగు, అమరావతి : రాజనీతిజ్ఞుడు, మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి గొప్ప దేశ భక్తులలో ఒకరని ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అన్నారు. వాజ్‌పేయి శత జయంతి సందర్భంగా పవన్‌కల్యాణ్ జనసేన తరుపున మంగళవారం ట్విటర్ వేదిక ద్వారా నివాళి అర్పించారు. మాతృభూమి స్వేచ్ఛ కోసం నిరంతరం కృషి చేసిన మహనీయుడని అభివర్ణించారు. అటల్‌జీ అసాధారణ మాటతీరు ప్రత్యర్థుల వెన్నులో వణుకు పుట్టించే సామర్థ్యం గల గొప్ప రాజనీతిజ్ఞుడని పేర్కొన్నారు. అతని పదాలు , పద్యాలు లక్షలాది

2

## జమ్మూకశ్మీర్‌లో ఘోర ప్రమాదం

మొదటిపేజీ తరువాయి సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. జవాన్ల మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. గాయపడ్డ జవాన్లను చికిత్స నిమిత్తం సమీప ఆస్పత్రికి తరలించారు. 300 అడుగుల లోతున్న లోయలో జవాన్ల వాహనం పడిపోయింది.

## ఫిబ్రవరి 1న కేంద్ర బడ్జెట్..

ప్రవేశపెడుతారు. ఈ సమావేశంలో సీతారామన్, నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ సుమన్ బేరీ, నీతి ఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యం, ముఖ్య ఆర్థిక సలహాదారు అనంత నాగేశ్వరన్, సుర్జిత్ భల్లా, డీకే జోషి సహా ప్రముఖ ఆర్థికవేత్తలు సమావేశానికి హాజరయ్యారు.

ఇదిలా ఉండగా భారతదేశ 2024–25 ఆర్థిక వృద్ధి మందగమనం నేపథ్యంలో ప్రధాని సమావేశం నిర్వహిస్తున్నారు. సెప్టెంబర్ త్రైమాసికంలో భారత ఆర్థిక వృద్ధి 5.4 శాతానికి పడిపోయింది. దాదాపు రెండేళ్ల కనిష్ఠానికి చేరింది. ఆర్‌బీఐ, రేటింగ్ ఏజెన్సీల అంచనాల కంటే ఘోరంగా తగ్గింది. గతేడాది ఇదే త్రైమాసికంలో జిడిపి ఏకంగా 8.1 శాతం పెరుగుదల చోటుచేసుకుంది. గడిచిన ఏప్రిల్–జూన్ త్రైమాసికంలో 6.7 శాతానికి పరిమితమైంది. ఈ రెండింటితోనూ పోల్చినా జీడీపీ భారీ తగ్గుదల నమోదవడం ఆందోళన కలిగిస్తున్నది. మరోవైపు రేటింగ్ ఏజెన్సీలు కూడా 6శాతం ఎగువన వృద్ధి ఉండొచ్చని అంచనా వేయగా.. వాటి కంటే తక్కువగా పడిపోవడం గమనార్హం.

జీడీపీ 7శాతం పెరుగుతుందని రిజర్వ్ బ్యాంక్ అంచనా వేయగా.. అంచనాలకు మంచి జీడీపీ పతనమైంది. రాబోయే బడ్జెట్‌లో ప్రైవేట్ పెట్టుబడులను ప్రోత్సహించేందుకు కేంద్రం ప్రోత్సాహకాలు ప్రకటిస్తుందా? లేదంటే సంస్కరణలు తీసుకువస్తుందా? అనేది ఆసక్తి నెలకొన్నది. జనవరి 20న అమెరికా అధ్యక్షుడిగా డోనాల్డ్ ట్రంప్ బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇటీవల ట్రంప్ భారత్, చైనా, బ్రెజిల్ సహా ఇతర దేశాల వస్తువులపై సుంకాలను పెంచనున్నట్లు హెచ్చరించారు. మరో వైపు ఈ నెల 20న రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలతో ఆర్థిక మంత్రి ప్రీ–బడ్జెట్ సమావేశం నిర్వహించారు. పంజాబ్, కేరళ సహా పలు రాష్ట్రాలకు చెందిన ఆర్థిక మంత్రులు కేంద్రం నుంచి ప్యాకేజీ ప్రకటించాలని కోరారు. దీర్ఘకాలిక మౌలిక సదుపాయాలు, మూల ధనం వ్యయం కోసం 50 సంవత్సరాల వడ్డీ లేని రుణాల కేటాయింపును పెంచాలని కేంద్రాన్ని కోరారు.

## మంచులో చిక్కుకున్న వెయ్యి వాహనాలు

మొదటిపేజీ తరువాయి సుమారు 1000 వాహనాలు నిలిచిపోయాయి. రాత్రి నుంచి రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతోంది. అటల్ టన్నెల్ నుంచి మనాలిలోని సోలాంగ్ నాలా వరకు లేహ్ మనాలి జాతీయ రహదారిపై మంచు భారీగా కురిసింది. దీంతో వాహనాలు జారిపోయి సొరంగం దగ్గర అనేక వాహనాలను ఆపవలసి వచ్చింది. ఇదే సమయంలో మంచు దృష్యాలను చూసేందుకు అక్కడికి చేరుకున్న పర్యాటకులు ఇబ్బందులు పడ్డారు.

## విజయవంతంగా వందే భారత్ స్లీపర్ ట్రయల్ రన్

మొదటిపేజీ తరువాయి విజయవంతంగా పరీక్షించారు. మధ్యప్రదేశ్‌లోని కజురహో–ఉత్తరప్రదేశ్‌లోని మహోబా రైల్వే స్టేషన్ల మధ్య రెండు రోజులపాటు ట్రయల్‌రన్ నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం చెన్నై ఐసీఎఫ్ నుంచి కజురహో చేరిన వందేభారత్ స్లీపర్ రైలు.. శనివారం అక్కడి నుంచి మహోబాకు చేరుకున్నది. మరుసటి రోజు కజురహో నుంచి తిరిగి మహోబాకు వచ్చింది. ఎస్ఆర్‌డీవో ఆధ్వర్యంలో జరిగిన ఈ ట్రయల్ రన్‌లో రైల్వే టెక్నికల్ టీమ్‌తోపాటు, ఐసీఎఫ్ అధికారులు కూడా పాల్గొన్నారు. ఈసందర్భంగా కజురహోకు వెళ్తున్న సమయంలో గంటకు 115 కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్లిన రైలు.. తిరుగు ప్రయాణంలో 130 కి.మీ. వేగంతో నడిచింది. ఈ సందర్భంగా అధికారులు సాంకేతిక అంశాలను పరిశీలించారు. అయితే వందేభారత్ రైలును గంటకు 160 నుంచి 200 కి.మీ. స్పీడ్‌తో వెళ్లేలా తయారుచేశారు. కాగా ఈ రైలు వచ్చే ఏడాది అందుబాటులోకి తీసుకురావాలని ఇండియన్ రైల్వే భావిస్తున్నది. దీనికోసం పది రైళ్లను సిద్ధం చేస్తున్నది.

## గొప్ప దేశభక్తులలో వాజ్‌పేయి ఒకరు

మంది హృదయాలను తాకాయని, చాలా మందికి స్ఫూర్తినిచ్చాయని అన్నారు. పార్లమెంట్‌లో ఆయన విలక్షణమైన మాటలు తనకు వ్యక్తిగతంగా మార్గనిర్దేశం చేశాయని పేర్కొన్నారు. దేశాన్ని ఐక్యత వైపు పరుగులు పెట్టించారని వెల్లడించారు. వాజ్‌పేయి నాయకత్వం భారతదేశ పరిస్థితులను మార్చివేశాయని స్వర్ణ చతుర్భుజం నుంచి, పోఖ్రాన్ అణు పరీక్షల వరకు, సర్వశిక్షా అభియాన్ నుంచి అందరికీ విద్యను అందించే అన్నపూర్ణ అన్న యోజన వరకు అహర్నిశలు ప్రజల కోసం శ్రమించారని తెలిపారు.

# పెద్ద తప్పు జరిగిపోయింది!



మొదటిపేజీ తరువాయి చంద్రశేఖర్ రెడ్డి, బన్నీ వాసుతో కలిసి ఆయన జూబ్లీహిల్స్‌లోని తన ఇంటి నుంచి బయల్దేరారు. మరోవైపు.. చిక్కడపల్లిపోలీసులు ఠాణా పరిసరాల్లో భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు. అటువైపు ఎలాంటి వాహనాలనూ అనుమతించలేదు.

పాదచారులను సైతం రానివ్వలేదు. చుట్టుపక్కల ఉన్న దుకాణాలన్నింటినీ మూయించారు. ఇనుప బారికేడ్లు ఏర్పాటు చేశారు. 11.05 గంటలకు అల్లు అర్జున్ పోలీస్ స్టేషన్‌కు చేరుకోగానే గేట్లు మూసేశారు. అల్లు అరవింద్‌ను, చంద్రశేఖర్ రెడ్డిని, బన్నీ వాసును కిందే ఆపేసిన పోలీసులు.. బన్నీని ఠాణా మొదటి అంతస్తులోని ఏసీపీ కార్యాలయంలోకి తీసుకెళ్లారు. అక్కడ డీసీపీ ఆకాంక్ష్ యాదవ్, ఏసీపీ రమేశ్, ఇన్‌స్పెక్టర్ రాజు నాయక్ బృందం.. అల్లు అర్జున్ తరఫు న్యాయవాది సమక్షంలో విచారణ ప్రారంభించారు. మధ్యాహ్నం 2:45 వరకు.. మూడున్నర గంటలపాటు ఈ విచారణ కొనసాగింది.

విచారణలో భాగంగా అల్లు అర్జున్‌పై పోలీసులు ప్రశ్నల వర్షం కురిపించినట్లు సమాచారం. విశ్వసనీయ వర్గాల ప్రకారం.. "ప్రీమియర్ షోకి హీరో హీరోయిన్‌లను రానివ్వొద్దంటూ పోలీసులు థియేటర్ యాజమాన్యానికి లిఖిత పూర్వకంగా తెలిపిన విషయం మీ దృష్టికి వచ్చిందా? రాలేదా? ఒకవేళ యాజమాన్యం ఆ విషయాన్ని మీ దృష్టికి తీసుకురావడంలో విఫలమైతే.. మీరు కుటుంబంతో పాటు ప్రీమియర్ షోకు వచ్చినప్పుడు నేరుగా థియేటర్‌లోకి వెళ్లకుండా బయట నుంచే ఓపెన్ టాప్ వాహనంలో నిలబడి చేతులు ఊపుతూ రోడ్‌షో ఎందుకు చేశారు? అలా చేయడానికి మీకు ఎవరు అనుమతి ఇచ్చారు? అనుమతి లేకుండా రోడ్‌షో చేయడం తప్పని మీకు తెలియదా? జరిగిన ఘోరం గురించి మీ దృష్టికి తెచ్చి.. వెంటనే అక్కణ్నుంచీ వెళ్లిపోవాలని సూచించినా ఎందుకు వెళ్లలేదు? అదే విషయాన్ని థియేటర్ యాజమాన్యం ద్వారా చెప్పించినా, స్వయంగా ఏసీపీ వచ్చి చెప్పినా మీరు ఎందుకు పట్టించుకోలేదు? మీ వల్ల జరిగిన తొక్కిసలాటలో ఒక మహిళ నిండు ప్రాణాలు కోల్పోవడంతోపాటు ఆమె కుమారుడు అపస్మారక స్థితిలోకి వెళ్లిన విషయం మీకు ఎప్పుడు తెలిసింది? ఎలాంటి అనుమతులూ లేకుండా బౌన్సర్‌లను, ప్రైవేట్ సెక్యూరిటీని థియేటర్ వద్దకు ఎలా తీసుకొస్తారు? మీతో పాటు.. మీ కోసం వచ్చి ప్రైవేట్ సెక్యూరిటీ, బౌన్సర్‌ల అత్యుత్సాహం వల్ల, థియేటర్‌లో తొక్కిసలాటకు జరుగుతుంటే మీరు ఎందుకు స్పందించలేదు?" అంటూ డీసీపీ ప్రశ్నలు సంధించారు.

రేవతి చనిపోయిన విషయం తనకు ఆరోజు తెలియదని, ఇంటికి వెళ్లిన తర్వాత తన ఫోన్ బయటపెట్టి, ఉదయం వరకూ లేపవద్దని చెప్పి తాను పడుకున్నానని, బన్నీవాసకు ఆ రాత్రే ఈ విషయం తెలిసిందని, మర్నాడు ఉదయం అతని ద్వారా తమకూ తెలిసిందని అర్జున్ పోలీసులకు వివరించినట్లు తెలుస్తోంది. విచారణ సందర్భంగా పోలీసులు ఒక్కొక్క ప్రశ్నా వేస్తూ.. దానికి అల్లు అర్జున్ చెప్పిన జవాబు విని, సంబంధిత వీడియోను ఆయనకు చూపించినట్టు సమాచారం. ఉదాహరణకు.. "పోలీసు అధికారులు థియేటర్‌లో ఉన్న మీ వద్దకు రాలేదని అన్నారుగా?" అనే ప్రశ్నకు.. రాలేదని బన్నీ సమాధానమివ్వగా, 'అయితే ఇదిగో ఈ వీడియో చూడండి' అంటూ పోలీసు ఉన్నతాధికారులు థియేటర్ లోపలికి వస్తున్న వీడియోను ఆయనకు చూపించినట్టు సమాచారం. ఈ క్రమంలోనే.. అల్లు అర్జున్ థియేటర్‌కు రావడానికి ముందు నుంచీ బౌన్సర్లు వ్యవహరించిన తీరును, ఆయన గేట్లు మూసివేయాలని బౌన్సర్లకు చెప్పిన దృశ్యాలను పోలీసులు చూపించినప్పుడు.. తన వల్ల తప్పు జరిగిందని ఆయన అంగీకరించినట్లు తెలుస్తోంది. థియేటర్ నుంచి బయటకు వచ్చిన తర్వాత కూడా కారు టాప్ నుంచి ఆయన అభిమానులకు అభివాదం చేసిన వీడియోలు, ట్రాఫిక్ జామ్ వీడియోలనూ పోలీసులు చూపించారు. అలాగే.. ఇటీవల పెట్టిన ప్రెస్ కాన్ఫరెన్స్ గురించి ప్రశ్నించినప్పుడు.. తనని తాను డిఫెండ్ చే సుకోవడానికి, తన న్యాయవాదుల బృందం ఇచ్చిన సూచనలమేరకే తాను మాట్లాడానని ఆయన వివరణ ఇచ్చినట్లు తెలుస్తోంది. పోలీసులు తన విషయంలో మీడియాకు అవాస్తవాలు చెప్పారని కూడా ఆయన అన్నట్లు సమాచారం. మొత్తమ్మీద పోలీసులు దాదాపు 20 ప్రశ్నలు సంధించగా.. వాటిలో ఒకటి రెండు మినహా మిగతా అన్ని ప్రశ్నలకూ ఆయన బదులిచ్చారని.. న్యాయవాదుల సూచనల మేరకు మిగతా ప్రశ్నలకు ఆయన సమాధానం దాటవేశారని, పోలీసులు ఎప్పుడు పిలిస్తే అప్పుడు విచారణకు హాజరవుతానని చెప్పారని విశ్వసనీయంగా తెలిసింది. ఈ విచారణ ప్రక్రియ మొత్తాన్నీ పోలీసులు వీడియో రికార్డింగ్ చేశారు.

# క్రైమ్ రేట్‌లో సైబరాబాద్!

మొదటిపేజీ తరువాయి విషయంలో ట్రై పోలీస్ కమిషనరేట్లలో సైబరాబాద్ మొదటి స్థానంలో నిలిచింది. హైదరాబాద్ రెండో స్థానంలో ఉంది. హైదరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనర్లు ఇప్పటికే 2024 వార్షిక నివేదికను విడుదల చేశారు. నివేదిక విడుదల అనంతరం అవినాష్ మహంతి మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ప్రతి ఫిర్యాదుపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడంతోనే సైబరాబాద్‌లో కేసుల సంఖ్య పెరిగినట్టు చెప్పారు. సైబర్ నేరాలతోపాటు ఆస్తుల గొడవలు, రోడ్డు ప్రమాదాలు, ఆర్థిక నేరాలు, సాధారణ దాడులు, ట్రెస్‌పాస్, వరకట్న వేధింపులు కూడా పెరిగినట్టు తెలిపారు. సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేసేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు వివరించారు. రోడ్డు ప్రమాదాల సంఖ్య పెరిగినా వాటిలో మరణాల సంఖ్య తగ్గినట్టు తెలిపారు. ఆర్థిక నేరాలకు సంబంధించిన మోసాల కేసుల్లో దర్యాప్తు కోసం ప్రత్యేక పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేశామని, దీనికి ఈ ఏడాది మార్చి వరకు 90 కేసులు నమోదైనట్టు వివరించారు. ఇక, సైబర్ నేరాల కారణంగా 2023లో రూ. 269 కోట్ల నష్టం వాటిల్లగా, 2024లో నవంబర్ వరకు రూ. 793 కోట్ల నష్టం జరిగింది. ఇందులో రూ. 70,46, 11,458ను బాధితులకు తిరిగి చెల్లించారు. ప్రధానంగా పార్ట్‌టైమ్ జాబ్స్, ట్రేడింగ్, స్మిషింగ్ నేరాలు అధికంగా జరిగాయి. 2023లో 102 డిజిటల్ అరెస్ట్‌లు నమోదు కాగా, ఈ ఏడాది వాటి సంఖ్య 1002కు పెరిగింది.

# ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం

మొదటిపేజీ తరువాయి గత వైసీపీ ప్రభుత్వం అర్హతలేని వారిని ఫైబర్‌నెట్‌లో నియమించిందని ఆరోపించారు. కొందరు సిబ్బంది వైసీపీ మంత్రులు, ఎమ్మెల్యేలు, నేతల ఇళ్లలో పనిచేశారని , వేతనాల పేరుతో ఫైబర్‌నెట్ నుంచి రూ. కోట్లు దుర్వినియోగం జరిగిందని వెల్లడించారు . వైసీపీ ప్రభుత్వ వైఖరితో సైబర్‌నెట్ దివాలా అంచుకు చేరిందని అన్నారు. తాము కక్ష , దురుద్దేశంతో ఉద్యోగులను తొలగించడం లేదని, ఉద్యోగులకు లీగల్ నోటీసులు ఇచ్చి వివరణ కోరుతామన్నారు. అవసరం మేరకు ఉద్యోగులను తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. ఫైబర్‌నెట్ నుంచి ప్రముఖ దర్శకుడు ఆర్జీవీకి అక్రమంగా డబ్బు చెల్లించారని తెలిపారు. డబ్బు చెల్లించేందుకు ఆర్జీవీకి 15 రోజుల సమయం ఇచ్చామని, గడువులోగా డబ్బు చెల్లించకుంటే ఆర్జీవీపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

## సూరీడుని ముద్దాడిన పార్కర్

ఎక్కువ వేగంతో ప్రయాణిస్తుంది. మంగళవారం సాయంత్రం సూర్యుడి బాహ్యవలయమైన కరోనాకు సుమారు 61 లక్షల కిలోమీటర్ల దూరం వరకూ పార్కర్ ప్రోబ్ చేరుకొన్నట్టు శాస్త్రవేత్తలు తెలిపారు. బుధ గ్రహానికి, సూర్యుడికి మధ్య ఉన్న ఎడానికి ఇది 8 రెట్లు తక్కువ దూరమని పేర్కొన్నారు. సూర్యుడి కరోనా ప్రాంతంలో అతిభయంకరమైన వాతావరణం, రేడియేషన్ ఉంటుంది. ఉష్ణోగ్రత చాలా ఎక్కువ. దీన్ని తట్టుకుని పార్కర్ వ్యోమనౌక డాటాను సేకరించాల్సి ఉంటుంది. అందుకే సూర్యుడి నుంచి వెలువడే ఉష్ణానికి దెబ్బతినకుండా పార్కర్ ప్రోబ్‌ను బలమైన హీట్‌షీల్డ్‌తో కవర్ చేశారు. టైటానియమ్–జిర్కోనియమ్–మాలిబ్డినమ్‌తో తయారు చేసిన ఈ ప్లేట్ 2,349 డిగ్రీల సెంటిగ్రేడ్ (4,260 డిగ్రీల ఫారన్‌హీట్) ఉష్ణోగ్రతలను కూడా తట్టుకోగలదు. సూర్యుడి కరోనాను సమీపించిన పార్కర్‌కు అంత వేడిలో సిగ్నల్స్‌ను భూకేంద్రానికి పంపించడం కుదరకపోవచ్చని శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు.

# అమిత్ షా దేశ దేశ ప్రజలకు వెంటనే క్షమాపణలు చెప్పాలి

– బీఎస్పీ రాష్ట్ర కోఆర్డినేటర్ బోడపట్ల ఈశ్వర్



తొలి అడుగు, సిద్దిపేట జిల్లా, డిసెంబర్ 24 : బహుజన్ సమాజ్ పార్టీ సిద్దిపేట జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు కటికల ఓం ప్రకాష్ అధ్యక్షతన మంగళవారం ముస్తాబాద్ చౌరస్తా నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈనెల 17వ తారీఖున పార్లమెంటులో కేంద్ర హెూం మంత్రి అమిత్ షా మాట్లాడుతూ... భారత రాజ్యాంగ నిర్మాత, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి స్వేచ్ఛ సమానత్వం సౌభ్రాత తత్వం దేశ ప్రజలందరికీ సమాన హక్కులు కల్పిస్తూ ప్రపంచంలోని అతిపెద్ద లిఖితపూర్వక రాజ్యాంగాన్ని రచించినటువంటి అంబేద్కర్ పైన అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్ షా దేశ ప్రజలకు వెంటనే క్షమాపణ చెప్పాలని అలాగే కేంద్ర క్యాబినెట్ నుండి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు, దేశద్రోహం కేసు నమోదు చేయాలన్నారు. బహుజన్ సమాజ్ పార్టీ జాతీయ అధ్యక్షురాలు ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి మాయావతి ఆదేశాల మేరకు దేశవ్యాప్త పిలుపులో భాగంగా మంగళవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ముస్తాబాద్ చౌరస్తా నుండి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించడం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర కోఆర్డినేటర్ బోడపట్ల ఈశ్వర్ హాజరయ్యారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ... అంబేద్కర్ పైన అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్ షా నూ దేశ ప్రజలందరికీ క్షమాపణలు చెప్పాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో దీన్ని మరింత ఉదృతం చేస్తామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లింగంపల్లి యాదగిరి, జిల్లా ఇంచార్జ్ దేగల వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షులు కటికల ఓం ప్రకాష్, జిల్లా ఉపాధ్యక్షులు ఈర్ల మల్లేశం ముదిరాజ్, ఆ ప్రధాన కార్యదర్శి ఎనగందుల శంకర్, జిల్లా మహిళా కన్వీనర్ పులి నిరాజా,జిల్లా కార్యదర్శి కొండనుల నరేష్ నాలుగు అసెంబ్లీలో ఇన్చార్జిలు పంగా బాబు, అసెంబ్లీ అధ్యక్షులు పుల్లూరు ఉమేశ్, రమణాకర్, వేల్పుల రాజు, పోతారం రాజు, కథా మహేష్, లింగం, కిరణ్, గజ్జల తిరుపతి, మైల తిరుపతి, శ్రీనివాస్, చంద్రం, నరేష్ అంజి తిరుపతి శంకర్, నాగరాజు,ఫ్ బద్దిరాజు , దబ్బర యాదగిరి, అనిల్ ముదిరాజ్, రాఘు ముదిరాజ్, యశ్వంత్ ముదిరాజ్, రాజు స్థానిక బీఎస్పీ నాయకులు పాల్గొన్నారు.

# ముమ్మరంగా ఇందిరమ్మ ఇళ్ల ఇంటింటి సర్వే

– ఇందిరమ్మ ఇళ్ళ సర్వేలో పాల్గొన్న విజయ్ రాథోడ్



తొలిఅడుగు, అమనగల్ డిసెంబర్ 24 : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా శ్రీకారం చుట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్దిదారుల ఎంపిక కోసం నిర్వహిస్తున్న ఇంటింటి సర్వే కార్యక్రమం మేడిగడ్డ తాండ గ్రామపంచాయతీ లో ముమ్మరంగా కొనసాగుతోంది. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆదేశాల మేరకు మేడిగడ్డ తండాలో జరుగుతున్న సర్వేను ఇందిరమ్మ ఇళ్ల కమిటి సభ్యులు విజయ్ రాథోడ్, హరిలాల్ సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా విజయ్ రాథోడ్ మాట్లాడుతూ... అర్హులైన పేదలందరికి ఇందిరమ్మ ఇళ్లను కేటాయించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. మొదటి విడతలో ఒంటరి మహిళలకు,పూరి ఇళ్లలో నివసించేవారికి అసలు ఇళ్లు లేని వారికి ప్రభుత్వం మంజూరు చేయనుందని తెలిపారు. సర్వేకు వచ్చే అధికారులకు, సిబ్బందికి ప్రజలు సహకరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమాల్లో గ్రామపంచాయతీ కార్యదర్శి వెంకటయ్య, ప్రజలు కేళి, బుజ్జి, విజయ, ధనలక్ష్మి, దొలి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కల్లు డిపోలపై దాడులు నిర్వహించిన ఆంటీ నార్కో పోలీసులు







తొలి అడుగు, సిద్దిపేట జిల్లా, డిసెంబర్ 24 : సిద్దిపేట పట్టణ పరిసర ప్రాంతాలలో ఉన్న కల్లు దుకాణాలు డిపోలపై యాంటీ నార్కటిక్స్ బ్యూరో అధికారులు సిబ్బంది దాడులు చేశారు. ఈ సందర్భంగా పలు మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. 13 గ్రాముల అల్ప్రాజోలమ్, 1118 కల్తీకల్లు, సీసాలు 800 లీటర్ల కల్లు, సిద్దిపేట పట్టణం పరిసర ప్రాంతాలలో కళ్లు డిపోలలో కల్లు దుకాణంలో కొంతమంది యజమానులు, కల్లు విక్రయించేవారు ప్రభుత్వం నిషేధించిన అల్ప్రాజోలమ్ ను కల్లులో కలిపి వినియోగదారులకు విక్రయించి అక్రమంగా డబ్బులు సంపాదిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారన్నారు. నమ్మదగిన సమాచారంపై ఉన్నతాధికారుల ఆదేశానుసారం యాంటీ నార్కోటిక్స్ బ్యూరో (టీజీ నాబ్) డీఎస్పీలు ఉపేందర్, పుష్పం కుమార్, సోమనాథం, సిద్దిపేట ఏసీపీ మధు, వన్ టౌన్ ఇన్స్పెక్టర్ వాసుదేవరావు, టూ టౌన్ ఇన్స్పెక్టర్ ఉపేందర్, త్రీ టౌన్ ఇన్స్పెక్టర్ విద్యాసాగర్, మరియు సిబ్బందితో కలిసి సిద్దిపేట పట్టణం పరిసర ప్రాంతాలలో ఏకకాలంలో కల్లు డిపోలలో, కల్లు దుకాణాలలో దాడులు నిర్వహించారు.? భారత్ నగర్ లో ఉన్న కల్లు డిపో, ఇందిరమ్మ కాలనీలో ఉన్న కల్లు దుకాణం, పటేల్ పురం లో ఉన్న కల్లు షాపు నెంబర్-2, రంగదాంపల్లి కల్లు దుకాణంలో దాడులు నిర్వహించారు. అదుపులోకి తీసుకున్న నిందితుల వివరాలలో

1 పల్లె రాములు తండ్రి బాలమల్లు, వయస్సు 52 సంవత్సరములు, కులం గౌడ్, నివాసం భారత్ నగర్, సిద్దిపేట.

2 అంబటి రాజు తండ్రి భూమయ్య, వయస్సు 55 సంవత్సరాలు, నివాసం ఇందిరమ్మ కాలనీ సిద్దిపేట.

3 పల్లె అంజయ్య గౌడ్ తండ్రి నర్సాగౌడ్, వయస్సు 55 సంవత్సరాలు, పటేల్ పుర సిద్దిపేట.

4 బోడిగే శ్రీనివాస్ గౌడ్ తండ్రి యాదగిరి, వయస్సు 51 సంవత్సరాలు, నివాసం రంగదాంపల్లి సిద్దిపేట పట్టణం ఉండగా.. గాదగోని ప్రకాష్ గౌడ్, గాదగోని శ్రీనివాస్ గౌడ్, పల్లె అనిల్, ముంద్రాయి రాజు , గడ్డమీది రాజా గౌడ్ పరారీలో ఉన్నట్లు తెలిసింది. సిద్దిపేట వన్ టౌన్, టూ టౌన్, 3 టౌన్ పోలీసులు కేసులు నమోదు చేసి పరిశోధన ప్రారంభించారు.

యాంటీ నార్కోటిక్స్ బ్యూరో అధికారులు మాట్లాడుతూ ...

అల్ప్రాజోలమ్ ప్రభుత్వం నిషేధించడం జరిగింది. ప్రభుత్వం నిషేధించిన వస్తువును కొంతమంది కల్లు వ్యాపారస్తులు డబ్బు సంపాదన గురించి కల్లులో అల్ప్రాజోలమ్ కలుపుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా ఎవరైనా కల్లు దుకాణాలలో అల్ప్రాజోలమ్ కలిపిన ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడిన వారి వివరాలను సెల్ నెంబర్ 8712671111 లేదా ఆంటీ నార్కోటిక్ బ్యూరో టోల్ ఫ్రీ నెంబర్ 1908 కాల్ చేసి తెలపాలని సూచించారు. సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు.

# ఉచిత వైద్య ఆరోగ్య శిబిరం



తొలిఅడుగు, కల్వకుర్తి, డిసెంబర్ 24 : కడ్తాల్ మండల పరిధిలోని కర్కల్ పహాడ్ గ్రామంలో ఉప్పల చారిట్రబుల్ ట్రస్ట్, జర్పుల రాధాకృష్ణ మెమోరియల్ ట్రస్ట్, గంప లక్ష్మయ్య గుప్తా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిభిరం డాక్టర్ ఉప్పల అఖిల్, డాక్టర్ ఉప్పల అనిల్, డాక్టర్ భావన ప్రారంభించారు. స్వయంగా 155 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందుల పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కడ్తాల్ మండల మాజీ జడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్, పిఏసిఎస్ చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా, మాజీ సర్పంచ్ వెంకోబ, ఎంపీటీసీ లచ్చిరామ్ నాయక్ మాట్లాడుతూ... గ్రామం అలాగే చుట్టుపక్కల ఉన్న తండాల నుంచి దూర ప్రాంతాలకు వెళ్లే వారికి ఈ వైద్య శిభిరం చాలా ఉపయోగమన్నారు. అలాగే మా కడ్తాల్ మండలంలో ప్రభుత్వ దవాఖాన లేక ప్రజలు పేదవారు ఇబ్బందులు పడుతున్న సమయంలో ఈ ట్రస్ట్ ల ద్వారా ఉచిత వైద్య శిబిరం గ్రామస్థులు అదృష్టంగా భావిస్తున్నారని తెలిపారు. ఉప్పల వెంకటేష్ ఉచితంగా మందులు ఇవ్వడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ఆయన సేవలను ప్రత్యేకంగా కొనియాడారు. అదే విధంగా గ్రామస్థులు, మహిళలు, యువకులు, ఉప్పల వెంకటేష్ కి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యాదయ్య, మహేష్, మైలారం రాజు, అర్జున్, బుచ్చిబాబు, వగ్గ మహేష్, సూరిగిమల్ల శేఖర్, తుడుం శ్రీశైలం, ఈరయ్య, శ్రీను, వెంకటయ్య, వడ్డే వీరయ్య, నరేందర్, గ్రామ పెద్దలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం సహాయనిధి చెక్కులు అందిస్తున్న ఎల్ హెచ్ పిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దశరథ్ నాయక్

తొలిఅడుగు, కల్వకుర్తి, డిసెంబర్ 24 : కడ్తాల్ మండలంలోని సలార్పూర్ గ్రామానికి చెందిన శ్రీనివాస్ కు మంజూరైన 30వేల రూపాయల సీఎం సహాయ నిధి చెక్కులను లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు జర్పుల దశరథ్ నాయక్ చేతుల మీదుగా బాధితులకు అందించారు. పేద బడుగు బలహీన వర్గాలకు ఆపద వస్తే కార్పొరేట్ హాస్పిటల్లో వైద్యం చేయించుకొని సీఎం సహాయ నిధిని ఉపయోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ హరిచంద్ నాయక్, మాజీ ఎంపిటిసి ప్రియా రమేష్, డైరెక్టర్ సేవ్య నాయక్, నాయకులు పాండు, శ్రీను, టిక్ లాల్ శ్రీను, భీమన్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# మానవసేవే మాధవసేవగా కొలుముల దామోదర్ యాదవ్ సేవలు



తొలిఅడుగు, పెద్దపల్లి జిల్లా, డిసెంబర్ 24 : ధర్మారం మండల చామనపల్లి గ్రామంలోని నిరుపేద 20 మందికి దుప్పట్లు (రగ్గులు) ఉచితంగా కొలుముల దామోదర్ యాదవ్ ఎన్నారై కెనడా సౌజన్యంతో పంపించగా 20 మందికి రగ్గులను అందజేశారు. ఫౌండేషన్ ఇంచార్జ్ వేల్పుల నాగరాజు ఆద్వర్యంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తిగుళ్ల అంజిరెడ్డి, కొమ్మ లచ్చయ్య, పనస సాగర్, మారం సాగర్, ఆవుల శ్రీను, బందరి సంజీవ్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం దుప్పట్లు తీసుకున్న వారు మాట్లాడుతూ... ఎక్కడో విదేశాల ఉండి మాకోసం చలికాలంలో ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని దుప్పట్లు పంపించినందుకు మానవత్వవాది కొలుముల దామోదర్ యాదవ్ కు కృతజ్ఞతలు తెలిపారు.

# కేంద్ర మంత్రి అమిత్ షా బహిరంగ క్షమాపణ చెప్పాలి

**- అమిత్ షా తన మంత్రి పదవికి వెంటనే రాజీనామా చేయాలి**

తొలిఅడుగు, జనగామ, డిసెంబర్ 24 : పార్లమెంట్ లో కేంద్ర మంత్రి అమిత్ షా డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ గారి పై చేసినటువంటి అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా బహుజన్ సమాజ్ పార్టీ జాతీయ అధ్యక్షురాలు బెహన్ కుమారి మాయావతి పిలుపు మేరకు మంగళవారం జనగామ జిల్లాలో బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు మడిపడిగ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జనగామ చౌరస్తా నుంచి కలెక్టర్ ఆఫీస్ వరకు జరిగిన నిరసన ర్యాలీ చేపట్టారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర ఈసి మెంబర్ నిర్మాల రత్నం పాల్గొని మాట్లాడారు... అంబేద్కర్ రాసినటువంటి రాజ్యాంగం ద్వారా పార్లమెంటుకు ఎన్నికై నిండు పార్లమెంట్ సమావేశంలో కేంద్రమంత్రి అమిత్ షా అంబేద్కర్ గురించి అవహేళనగా మాట్లాడిన మాటలు చాలా బాధాకరమన్నారు. ఒక మంత్రిగా ఉండి బాధ్యతగా వ్యవహరించాల్సినటువంటి వ్యక్తి ఇటువంటి కించపరిచే మాటలు మాట్లాడడం సరికాదని అన్నారు.

భారత ప్రధాని నరేంద్ర మోడీ తక్షణమే స్పందించి అమిత్ షా ను కేంద్ర మంత్రి పదవి నుండి తొలగించి కేంద్రమంత్రి అమిత్ షా తక్షణమే భారతదేశ సమాజానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేకపోతే బిఎస్పీ ఆధ్వర్యంలో వివిధ రూపాలలో పోరాటం చేస్తామని హెచ్చరించారు. నిరసన ర్యాలీ అనంతరం జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వన్ బాషా షేక్ ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు రాపాక శ్రీశైలం, జనగామ అసెంబ్లీ ఇంచార్జ్ జెరిపోతుల మల్లయ్య, జనగామ అసెంబ్లీ అధ్యక్షులు చిలుముల అర్జున్,స్టేషన్ ఘనపూర్ అసెంబ్లీ అధ్యక్షులు జలగం ప్రవీణ్,పాలకుర్తి అసెంబ్లీ అధ్యక్షులు ఈదునూరి ప్రసాద్,జనగామ అసెంబ్లీ ఉపాధ్యక్షులు తాండ్ర సిద్దులు,అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి తాండ్ర అఖిల్,పాలకుర్తి అసెంబ్లీ ఉపాధ్యక్షులు వేల్పుకొండ కుమారస్వామి,పాలకుర్తి ప్రధాన కార్యదర్శి చింత గణేష్,నాయకులు నరగోని రాజు,భాస్కర్,జోగు శివ గందమల్ల నవనీత,తాండ్ర లావణ్య, శ్రీకాంత్,నవీన్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



# కేంద్రమంత్రి అమిత్ షా -రాజీనామా చేయాలి

**- సిపిఎం జనగామ పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్**



తొలి అడుగు, జనగామ, డిసెంబర్ 24 : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షా వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని సిపిఎం జనగామ పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్ డిమాండ్ చేశారు. జనగామ సిపిఎం కార్యాలయంలో బాల్నే వెంకట మల్లయ్య అధ్యక్షత వహించగా ఈ సమావేశానికి జోగు ప్రకాష్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ను కించపరిచి అవమానపరిచేలా కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్ షా రాజ్యసభలో చేసిన వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా ఆగ్రహాన్ని కలిగించి నిరసనలకు దారితీసాయని అయినప్పటికీ అమిత్ షా కానీ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ కానీ బాధ్యత తీసుకొని దిద్దుబాటు చర్య చేపట్టలేదు అని అన్నారు. ప్రధానమంత్రి మోడీ కూడా ఈ వ్యాఖ్యలను ఎందుకు ఖండించలేదని అన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాజ్యాంగం ద్వారా పదవులను అనుభవిస్తూ అవహేళన చేయడం సరైనటువంటి కాదు అని అన్నారు. ఇప్పటికైనా దేశ ప్రజలందరికీ క్షమాపణ చెప్పి చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని అన్నారు. లేకపోతే బడుగు, బలహీన వర్గాలు, ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలందరినీ కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళనలు పోరాటాలు నిర్వహిస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కమిటీ సభ్యులు కల్యాణ లింగం, బోట్ల శ్రావణ్, నాయకులు కొండ వరలక్ష్మి, సుమ, యాకయ్య లక్ష్మి, శీను, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర మంత్రి అమీషా వెంటనే రాజీనామా చేయాలి



తొలి అడుగు, సిద్దిపేట జిల్లా, డిసెంబర్ 24 : తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ పీసీసీ బొమ్మ మహేష్ కుమార్ ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పైన చేసిన అనుచిత వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని సిద్దిపేట పట్టణం పాత బస్టాండ్ దగ్గర అంబేద్కర్ కి వినతి పత్రం ఇచ్చి కలెక్టర్ ఆఫీస్ లో కలెక్టర్ కి వినతి పత్రం అందజేశారు. జిల్లా అధ్యక్షులు తుంకుంట నర్సారెడ్డి, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ నాయకురాలు ఆంక్షరెడ్డి,గజ్వెల్ ఏఎంసీ చైర్మన్ నరేందర్ రెడ్డీ, సీనియర్ నాయకులు దరిపల్లి చంద్రం, తాడూరి శ్రీనివాస్, గూడూరి శ్రీనివాస్, డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్ రెడ్డీ,పట్టణ అధ్యక్షులు అత్తు ఈమం, ముద్దం లక్ష్మి, కౌన్సిలర్లు సాకి ఆనంద్, రియాజ్దీన్, మార్క సతీష్, దాసు అంజయ్య, పూజల గోపికృష్ణ, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# ప్రాథమిక పాఠశాలల్లో తరగతికి ఒక టీచర్ ఉండేలా విద్యా హక్కుచట్టంను సవరించాలి

– పీఎస్ టీయు రాష్ట్ర కోశాధికారి పానుగంటి నర్సింహా చారి

తొలి అడుగు, చిన్నకోడూరు, డిసెంబర్ 24 : నో డిటెన్షన్ విధానాన్ని రద్దు చేసిన విధంగా, సంఖ్యతో సంబంధం లేకుండా ప్రతి ప్రాథమిక పాఠశాలలో తరగతి ఒక టీచర్ ను నియమించేలా విద్యా హక్కు చట్టం లో సవరణలు తీసుకు రావాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాము. ప్రస్తుతం విద్యాహక్కు చట్టం ప్రకారం 60 సంఖ్య వరకు ఇద్దరు, 90 వరకు ముగ్గురు, 120 వరకు నలుగురు , 150 సంఖ్య దాటితే 5 గురు ఉపాధ్యాయులు ఉండి, ఒక ప్రధానోపాధ్యాయుడు ఉండాలనే నిబంధన ఉన్నది. ఈ నిబంధనలు సవరిస్తూ సంఖ్యతో సంబంధం లేకుండా తరగతి ఒక ఉపాధ్యాయుడు ఉండి, ప్రతి ప్రాథమిక పాఠశాలకు పిఎస్ హెచ్ఎం పోస్టు ఉండేలా విద్యా హక్కు చట్టం లో మార్పులు తీసుకు రావాలని కోరుతున్నాము.



# చేనేత ఐక్యవేదిక నంగునూరు మండల అధ్యక్షులుగా రవికుమార్

తొలి అడుగు, సిద్దిపేట జిల్లా, డిసెంబర్ 24 : నంగునూరు మండలం లో చేనేత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు వీర మోహన్ ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షుడు ముదిగొండ శ్రీనివాస్ నంగునూరు మండలం అధ్యక్షులుగా దాసరి రవి కుమార్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు మాట్లాడుతూ... జాతి చైతన్యం కోసం చేయనేత పరిశ్రమ పరిరక్షణ కోసం తనవంతు కృషి చేస్తానన్నాడు తనపై నమ్మకంతో బాధ్యతలుబాధ్యతలు అప్పగించిన చేనేత ఐక్యవేదిక నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు.



# ఘనంగా జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవం

తొలిఅడుగు, సిద్దిపేట జిల్లా, డిసెంబర్ 24 : సిద్దిపేట జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా సిద్దిపేట కలెక్టర్ కార్యాలయంలో వినియోగదారుల అవగాహన సదస్సు నిర్వహించారు. డిజిటల్ మార్కెట్ వ్యవస్థను ఆసరా చేసుకుని వ్యాపారులు అధిక లాభాల కోసం చేస్తున్న కల్తీలపై,నకిలీ వస్తువుల అమ్మకాలతో పాటు ,సామాన్య ప్రజలను ఎమ్మార్పీ ధరల కంటే అధిక ధరలతో మోసం విధానాలపై ప్రజలకుఅవగాహన కల్పించాలని సిద్దిపేట జిల్లా వినియోగదారుల ఫోరం కమిటీకి జిల్లా సివిల్ సప్లై ఆఫీసర్ తనుజ సూచించారు. ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా మంగళవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో జిల్లా వినియోగదారుల ఫోరం కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా సివిల్ సప్లై ఆఫీసర్ తనుజ హాజరు కాగా జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవం సంధర్భంగా ఇటీవల ఢిల్లీలో 15వ తేదీ నాడు సేవా రత్న జాతీయ అవార్డు కుంభాల రవి, జాతీయ అంబేద్కర్ అవార్డు గ్రహీత గుర్రాల శ్రీనివాస్ వినియోగదారునికి మేల్కొలిపేలా ప్రయత్నం చేస్తున్న కన్స్యూమర్ ఫోరం ఈసీ మెంబర్ బండమీది మల్లయ్యను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతీ వినియోగదారుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన కొత్త వినియోగదారుల చట్టం ప్రకారం 2019 పై అవగాహన పెంచుకుని ప్రభుత్వం కల్పించిన సదుపాయాల సమర్థంగా వినియోగించుకోవాలని అన్నారు. వినియోగదారుల వ్యవహారాల నాణ్యత లేని వస్తువులను అసలు ధర కంటే ఎక్కువ ధర అమ్ముతుంటే మా దృష్టికి తీసుకురావాలని వారు అన్నారు. కిరాణ షాపుల్లో ఎంఆర్పీ ధరల కంటే అధిక ధరలు అమ్ముతుంటే వెంటనే వినియోగదారులు తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు. పెట్రోల్ బంకుల్లో కొన్ని వసతులు లేకపోతే శాఖ పరమైన చర్య తీసుకుంటామన్నారు. సిద్దిపేట జిల్లా వినియోగదారుల ఫోరం అధ్యక్షులు కుంభాల రవీందర్ మాట్లాడుతూ... రైస్ మిల్లల్లో జరుగుతున్న అవినీతి, అక్రమాలతో పాటు ఐకేపీ సెంటర్లో అధిక తూకం వేసి రైతులను మోసం చేస్తున్న విధానం పై జిల్లాలో పలు ఆస్పత్రులు, మార్కెట్లో సగటు వినియోగదారుల అవసరాన్ని ఆసరాగా చేసుకుని అధిక ధరలతో మోసం చేస్తున్న వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా సివిల్ సప్లై ఆఫీసర్ తనుజ దృష్టికి తీసుకెళ్లారు. అంతేకాకుండా కన్స్యూమర్ ఫోరం ఆధ్వర్యంలో

ప్రజలకు అనేక అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తామని గుర్తు చేశారు. బాధితులకు జిల్లా వినియోగదారుల ఫోరం జిల్లా కమిటీ తప్పకుండా

అండగా పని చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డి సి ఎస్ ఓ ఆఫీసర్ సాయి రవి, డిప్యూటీ తాసిల్దార్ రాజిరెడ్డి, సాయిబంధి, జిల్లా అసోసియేషన్ ప్రెసిడెంట్ సతీష్, సోమయ్య, జిల్లా డీలర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ దొమ్మాట రవీందర్, ప్రకాష్ ,జిల్లా పెట్రోల్ బంక్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బండ నరసింహులు ,జిల్లా కన్స్యూమర్ ఫోరం జిల్లా జనరల్ సెక్రెటరీ అజయ్ కుమార్ ,కార్యదర్శి ఎండి రియానా బేగం ,రాజమణి తదితరులు ఉన్నారు.




# వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహను కలిసిన దళిత జన సమితి ప్రతినిధులు

తొలి అడుగు, సిద్దిపేట జిల్లా, డిసెంబర్ 24 : నంగునూరు మండలంలో మంగళవారం హైదరాబాద్, మినిస్టర్ క్వార్టర్స్ లో వైద్య ఆరోగ్యశాఖ మంత్రివర్యులు దామోదర రాజనర్సింహను దళిత జన సమితి ప్రతినిధులు కలిశారు. ఈ సందర్భంగా... దళిత జన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు బొజ్జ యాదగిరి మాట్లాడుతూ... ప్రైవేటు హాస్పిటల్స్ లో జరుగుతున్న విచ్చలవిడి దోపిడిని అరికట్టాలని మెమోరాండం అందజేస్తూ ఇటీవల ప్రమాదం లో గాయాలపాలై నిమ్స్ లో అడ్మిట్ అయిన కీర్తి కుమార్ కోసం వివరిస్తూ వారిది చాలా నిరుపేద కుటుంబమని ప్రభుత్వం చొరవ తీసుకొని 5 లక్షల ఎల్ వో సీ మంజూరు చేసి ఆ కుటుంబాన్ని ఆదుకోవాల్సిందిగా ఈ సందర్భంగా తెలియజేయడం జరిగింది. ఈ సమస్యపై వారు సానుకూలంగా స్పందించడం జరిగిందని తెలిపారు. ఇదేవిధంగా పలు సమస్యలపై మాట్లాడుతూ... మంత్రికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిడిశెట్టి చంద్రమౌళి, రాష్ట్ర కార్యదర్శి బావండ్లపల్లి గంగాధర్, రాష్ట్ర నాయకులు సంపత్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



# సీసీ రోడ్డు పనులకు శంఖుస్థాపన చేసిన విప్ అడ్లూరి లక్ష్మణ్

తొలి అడుగు, దర్మారం, డిసెంబర్ 24 : మేడారం గ్రామం గొల్లవాడ నుండి గోపాలరావు పెట్ వరకు సీఎస్ఆర్ నిధుల నుండి 45 లక్షల వ్యయంతో మంజూరు అయినా ఫార్మేషన్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసినందుకు చాలా సంతోషంగా ఉందని జిల్లా కలెక్టర్ తో మాట్లాడి రాష్ట్ర ప్రభుత్వంతో దృష్టికి తీసుకెళ్లి సీఎస్ఆర్ నిధుల ద్వారా ఇట్టి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేయడం జరుగుతుందని, జడ్పీ కి కూడా కనెక్టింగ్ కావాలని ప్రజలు నా దృష్టికి తీసుకురావడం జరిగిందని,దానికి సంబంధించి కూడా నిర్మాణాన్ని చేపట్టాలని అధికారులకు ఆదేశాలు ఇవ్వడం జరిగిందనీ,అదే విధంగా ఉప ముఖ్యమంత్రి భట్టి మేడారం గ్రామానికి సోలార్ ప్రాజక్ట్ ను కూడా మంజూరు చేస్తామని ప్రకటించడం జరిగిందని,దానికి కూడా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ విషయంలో కూడా గ్రామ సభ నిర్వహించి అర్హులైన పేదవారికి ఇళ్లను పంపిణీ చేస్తామని,గత ప్రభుత్వం పదకొండున్నర శాతం వడ్డీతో అప్పులను తీసుకొచ్చి అప్పుల కుప్పగా రాష్ట్రాన్ని మాకు అప్పగించినప్పటికి వాటిని తీరుస్తూ ముందుకు వెళ్లడం జరుగుతుందని ధర్మపురి వద్ద గోదావరిలో మురుగు నీరు కలవకుండా ఎస్టీపీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని,అదే విధంగా వేములవాడ,కొండగట్టు,ధర్మపురి,కోటిలింగాల పుణ్యక్షేత్రాలను కలుపుతూ టూరిజం కారిడార్ ను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారినీ కోరడం జరిగిందనీ వారు కూడా ఇట్టి విషయాలపై సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు



# తాగూర్ లాబరేటరీస్ ప్రమాద బాధిత కుటుంబాలకు చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే పంచకర్ల

తొలి అడుగు పరవాడ డిసెంబర్ 24 : అనకాపల్లి జిల్లా పెందుర్తి నియోజకవర్గం పరవాడ మండలం జవహర్లాల్ నెహ్రూ ఫార్మాసిటీలో గతంలో ప్రమాదం జరిగిన తాగూర్ లాబరేటరీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఫార్మా కంపెనీ లో విషవాయువు పీల్చి ప్రాణాల కోల్పోయిన బాధిత కుటుంబ సభ్యులకు మంగళవారం నాడు పరవాడ మండల తహసీల్దార్ కార్యాలయంలో చెక్కలు పంపిణీ చేసిన జనసేన పార్టీ ఉమ్మడి విశాఖపట్నం రూరల్ జిల్లా అధ్యక్షులు పెందుర్తి నియోజకవర్గం శాసనసభ సభ్యులు పంచకర్ల రమేష్ బాబు. వీరితోపాటు మండల రెవెన్యూ ఆఫీసర్ అంబేద్కర్ , మండల పార్టీ అధ్యక్షులు బొద్దపు శ్రీనివాసరావు , వియ్యపు చిన్న , విశాఖ రూరల్ జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి బుగిడి రామ గోవిందరావు , పరవాడ గ్రామ సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు , తానం గ్రామ సర్పంచ్ కన్నూరు రమణ , ముత్యాలంపాలెం గ్రామ సర్పంచ్ చింతకాయల సుజాత ముత్యాలు గారు, రావాడ గ్రామ సర్పంచ్ మోటూరు సన్యాసినాయుడు గారు, పరవాడ మండలం




మాజీ ఎంపీపీ సభ్యులు మాసరపు నాయుడు గారు,ఫార్మా కంపెనీ యాజమాన్యం మరియు పరవాడ మండలం ఉమ్మడి ఎన్ డి ఏ మహాకూటమి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# మద్ది ఆంజనేయ స్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు



జంగారెడ్డిగూడెం తొలి అడుగు డిసెంబర్ 24, : ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలం గురువాయిగూడెం గ్రామం నందు మద్ది ఆంజనేయ స్వామి ఆలయంలో తెల్లవారుజామున ఆలయ అర్చకులు స్వామివారికి ప్రభాత సేవ, నిత్యార్చన పూజలు నిర్వహించారు ఈరోజు మంగళవారం కావడంతో దర్శనాలకు విచ్చేసిన భక్తులు హనుమత్ నామస్మరణతో ఆలయం మారుమరోగింది. భక్తులు స్వామివారి ఆలయం చుట్టూ 108 ప్రతిక్షణం చేసి మొక్కలు చెల్లించుకున్నారు. ఈ స్వామి తమ కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా భక్తులు కొలుస్తారు ఆలయ అర్చకులు సే అన్నప్రాసనలు వాహన పూజలు చేయించుకున్నారు మధ్యాహ్నం వరకు దేవస్థానమునకు వివిధ సేవల రూపేనా రూ1,37,159/ లు సమకూరినది. సుమారు 2000 మంది భక్తులకు స్వామివారి నిత్య అన్నదాన సత్రం నందు అన్న ప్రసాద వితరణ చేశారు. స్వామివారి దర్శనముకు విచ్చేసిన భక్తులకు ఇటువంటి అసౌకర్యములు కలక్కుండా పర్యవేక్షకులు పర్యవేక్షణలో తగిన ఏర్పాట్లు గావించి నట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారిని ఆర్ వి చందన తెలిపారు.

# ముత్యాలమ్మపాలెం పంచాయతీ లో జరుగుతున్న అభివృద్ధి పై తప్పుడు పిర్యాదులను కండిస్తున్న : సర్పంచ్ చింతకాయల

తొలి అడుగు పరవాడ డిసెంబర్ 24 : తేది 23-12-2024 న సోమవారం నాడు ముత్యాలమ్మపాలెం గ్రామానికి చెందిన అర్జిల్లి అప్పులరాజు అనేవ్యక్తి ,అవాస్తవాలతో ముత్యాలమ్మపాలెం పంచాయతీ లో ప్రజలు నివాస గృహలకు కాకుండా లేఔట్ కు సి.సి రోడ్డు ఎన్.ఆర్.ఈ.జి.ఎస్ పథకం కింద వేస్తున్నట్లు అనకాపల్లి జిల్లా కలెక్టర్ కి ప్రజా సమస్యల పరిష్కార వేదిక లో, తప్పుడు ఫిర్యాదు చేయడం జరిగిందని., దీనిని మేము తీవ్రంగా కండిస్తున్నట్టు సర్పంచ్ చింతకాయల సుజాత ముత్యాలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పత్రిక ప్రకటన ద్వారా వాస్తవాలు ముత్యాలమ్మపాలెం గ్రామ పంచాయితీలో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలుతో తేదీ 23-08-2024 న ప్రత్యేక గ్రామ సభలో తీర్మానించిన పనులకు, పంచాయితీ పాలక వర్గం ఆమోదించిగా, గ్రామ ప్రజలకు అత్యవసరమైన రోడ్డులు వెయ్యడం లో భాగంగా దిబ్బపాలెం గ్రామంలో ఆంజనేయస్వామి గుడి వద్ద నుండి అర్జిల్లి అప్పారావు ఇంటి వరుకు ,అలాగే వేట్లల దిబ్బ వద్ద నుండి అర్థిల్లి అప్పారావు ఇంటి వరుకు, ముత్యాలమ్మపాలెం గ్రామంలో అర్జిల్లి అప్పులరాజు ఇంటి వద్ద నుండి సూరాడ సోమునాముడు ఇంటి వరుకు, దిబ్బపాలెం బీచ్ నెట్ మేకింగ్ బిల్డింగ్ వద్ద నుండి కోవిరి రాజమ్మ ఇంటివరుకు,సముద్ర తీరం వద్ద నుండి సూరాడ మసేను ఇంటి వరకు సి.సి రోడ్లు నిర్మాణం చేయడం




జరిగిందని, జాలారి పేట గ్రామంలో కంబాల వారి వీధిలో సీసీ రోడ్డు నిర్మాణం కోరకు ఏర్పాటు చెయ్యడం జరుగుతున్నదాని., ఇలా గ్రామంలో వేస్తున్న గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా సీసీ రోడ్డులు గ్రామ ప్రజలకు అత్యంత ఉపయోగకరంగా ముత్యాలమ్మపాలెం పంచాయతీ పై దృష్టి శక్తులు కుట్రలు, కుముత్తలు మళ్ళీ మొదలై ఎన్.డి.ఏ ప్రభుత్వం అధికారంలో కి వచ్చిన తరువాత , పెందుర్తి శాసన సభ్యులు పంచకర్ల రమేష్ బాబు నాయకత్వంతో ముత్యాలమ్మపాలెం లో పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తే, అభివృద్ధి జరుగుతున్నందున కొందరు దుష్టశక్తులు కుట్రలు, పన్ని గ్రామ అభి వృద్ధిని అడ్డుకోవడమే లక్ష్యంగా జిల్లా ఉన్నత అధికారులకు తప్పుడు పిర్యాదు లు చేసినందున, దీనిని మేము తీవ్రంగా ఖండిస్తున్నాము అని తెలిపారు. గత పంచాయితీ ఎన్నికల్లో ఈ అర్జిల్లి అప్పలరాజు అనే దుష్ట శక్తికి గ్రామ ప్రజలు డిపాజిట్లు రాకుండ చేసిన వీడికి బుద్ధి రాలేదు అని మండిపడ్డారు. సామాజిక మాద్యాలు అనగా ఫేస్ బుక్ %డ% వాట్సాప్ గ్రూపు లలో ఫేక్ వీడియో లు ద్వారా తప్పుడు ప్రసారం చేసితున్న అర్జిల్లి అప్పలరాజు మరియు కొందరు దృష్ట శక్తులపై చట్ట పరమైన తగు చర్యలు తీసుకోవాలని, అధికారులు ,వివిధ తప్పుడు ఫిర్యాదులను నమ్మవద్దు అని గ్రామ సర్పంచ్ చింతకాయల సూజాత ముత్యాలు పత్రిక ప్రకటన లో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిటీసి అర్జిల్లి దేవిరవి ,మాజీ ఎంపిటీసి చింతకాయల అమ్మోరు ,స్కూల్ చైర్మన్ అర్జిల్లి కృష్ణ ,సూరాడ ముత్యాలరావు , చింతకాయల దేముడు ,చింతకాయల అప్పారావు ,అర్జిల్లి కొండబాబు ,మైలపల్లి కుల్లయ్యా ,తదితరులు పాల్గొన్నారు.

# హోండా నయా ఎస్‌పీ 160 ప్రారంభ ధర రూ.1.21 లక్షలు

న్యూఢిల్లీ, తొలిఅడుగు : ద్విచక్ర వాహన సంస్థ హోండా మోటర్‌సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా.. దేశీయ మార్కెట్లోకి నయా బైకు 'ఎస్‌పీ160'ని పరిచయం చేసింది. హై-టెక్ ఫీచర్‌తోపాటు అధిక పనితీరుతో రూపొందించిన ఈ బైకు కస్టమర్లకు నూతన రైడింగ్ అనుభవం కల్పించేవిధంగా తీర్చిదిద్దినట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. రెండు రకాల్లో లభించనున్న ఈ హోండా ఎస్‌పీ 160 మాడల్ సింగిల్ డిస్క్ ధర రూ. 1,21,951 కాగా, డబుల్ డిస్క్ ధర రూ. 1,27,956గా నిర్ణయించింది. ఈ ధరలు ఢిల్లీ షోరూంనకు సంబంధించినవి. ఈ సందర్భంగా కంపెనీ ఎండీ త్సుత్సుము ఒటాని మాట్లాడుతూ..కస్టమర్ల అభిరుచికి తగ్గట్టుగా ఈ నూతన ఎస్‌పీ160ని రూపొందించినట్లు, బ్లూటూత్ కనెక్ట్‌తో టీఎఫ్‌టీ డిస్‌ప్లే ఉండటంతో నావిగేషన్ ఆధారంగా తాము వెళ్లాలనుకున్న చోటికి సులభంగా చేరుకోవచ్చునన్నారు.



# ఐసీయూలో రూపీ

ముంబై, డిసెంబర్ 24: డాలర్ దెబ్బకు రూపాయి ఏమాత్రం నిలబడలేకపోతున్నది. ఫారెక్స్ మార్కెట్‌లో అమెరికా కరెన్సీతో పోల్చితే భారతీయ కరెన్సీ మారకం విలువ మళ్లీ ఆల్‌టైమ్ కనిష్ఠానికి దిగజారింది మరి. మంగళవారం మరో 4 పైసలు పడిపోవడంతో మునుపెన్నడూ లేనివిధంగా 85.15 వద్దకు చేరింది. దీంతో ఇంటర్‌బ్యాంక్ ఫారిన్ ఎక్స్చేంజ్‌లో గత 4 రోజులుగా రూపీ 85పైనే ఉంటున్నట్టైంది. గత గురువారం తొలిసారి 85 మార్కును దాటిన విషయం తెలిసిందే. సోమవారం కూడా 7 పైసలు నష్టపోగా.. ఈ రెండు రోజుల్లో 11 పైసలు కోల్పోయింది.

పతనం వెనుక..

డిసెంబర్ నెల ముగుస్తుండటంతో దేశీయ మార్కెట్‌లోని దిగుమతిదారులపై చెల్లింపుల ఒత్తిడి ఉంటుందని, ఈ క్రమంలోనే డాలర్లకు పెరుగుతున్న డిమాండ్.. రూపీని మరింత బలహీనపరుస్తున్నదని ఫారెక్స్ ట్రేడర్లు చెప్తున్నారు. పైగా జనవరిలో అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ రాబోతున్నారు. దీంతో మళ్లీ సుంకాల సమరం మొదలవుతుందన్న అంచనాలు గట్టిగా వినిపిస్తున్నాయి. ఫలితంగా డాలర్ల కోసం భారతీయ దిగుమతిదారులు ఎగబడిపోతున్నారు. కాగా, ఫెడ్ రిజర్వ్ కఠిన ద్రవ్య వైఖరి దిశగా వెళ్తుండటం కూడా రూపీ కష్టాల్ని పెంచిందన్న అభిప్రాయాలూ ఉన్నాయి. ఇక దేశీయ మార్కెట్ల నుంచి ఆగని విదేశీ మదుపరుల పెట్టుబడుల ఉపసంహరణలు సైతం పరిస్థితుల్ని ఇంకా దిగజార్చుతున్నాయి. మొత్తానికి రూపాయి పతనం.. దేశీయ దిగుమతుల్ని ఖరీదెక్కిస్తుండగా, ద్రవ్యోల్బణం, ద్రవ్య పరపతి, చివరకు దేశ ఆర్థిక వ్యవస్థల్నే ప్రమాదంలోకి నెడుతున్నది.







తొలిఅడుగు
తెలుగు దిన పత్రిక

# రాత్రి పడుకునేముందు ఇవి రాస్తే ఉదయానికే ఫేషియల్ లుక్..



తొలిఅడుగు, ఆరోగ్యం :అందంగా కనిపించాలని ఆడవారికైనా, మగవారికైనా అందరికీ ఉంటుంది. ముఖ్యంగా పండుగల సమయంలో మరింత ఆకర్షణీయంగా కనిపించాలనుకుంటారు. అయితే ఈ కోరిక మరింత ఎక్కువగా ఆడవారికి ఉంటుంది. వయసు పైబడుతున్నా యవ్వనంగా ఉండాలనుకుంటారు. ఇందు కోసం ఏవేవో ప్రయత్నాలు చేస్తూ ఉంటారు. ఖరీదైన క్రీములు కూడా వాడుతూ ఉంటారు. బ్యూటీ పార్లర్స్‌కు వెళ్లి డబ్బులు ఎక్కువగా పెట్టి మరీ ఫేషియల్స్ చేయించుకుంటూ ఉంటారు. కానీ ఇంట్లో ఉండే వాటితోనే మనం ఎంతో అందంగా తయారవ్వచ్చు. తక్కువ ఖర్చుతోనే అందంగా మెరిసిపోవచ్చు. ఈ విషయం తెలియక చాలా మంది డబ్బును వృథాగా ఖర్చు చేస్తున్నారు. ఇంట్లోనే కాస్త సమయం ఇస్తే ఫేషియల్ లుక్ మన సొంతం అవుతుంది. రాత్రి పడుకునే ముందు ఇవి రాసి పడుకుంటే ఉదయం వరకు మీ ముఖం మెరిసిపోతుంది.

**బాదం ఆయిల్:**

చర్మ సమస్యలను దూరం చేసి.. ముఖ సౌందర్యాన్ని పెంచడంలో బాదం ఆయిల్ కూడా ఎంతో చక్కగా హెల్ప్ చేస్తుంది. ఇందులో ఉండే విటమిన్ ఇ చర్మాన్ని మెరిసేలా చేస్తుంది. ప్రతి రోజూ రాత్రి పడుకునే ముందు బాదం నూనె ముఖానికి రాసి పడుకుంటే.. గ్లోతో పాటు చర్మ రంగు కూడా మెరుగు పడుతుంది.

**పచ్చి పాలు:**

పచ్చి పాలలో కూడా ఎన్నో పోషకాలు ఉంటాయి. పచ్చి పాలల్లో మనకు లాక్టిక్ యాసిడ్ ఉంటుంది. ఇది చర్మాన్ని క్లీన్ చేయడంలో ఎంతో చక్కగా సహాయ పడుతుంది. రాత్రి పడుకునే ముందు పచ్చి పాలలో కాటన్ ముంచి ముఖంపై అంతా అప్లై చేసుకుని పడుకోవాలి. ఓ గంట సేపు ఉంచి అయినా కడిగేసుకోవచ్చు. ఇలా తరచూ చేస్తే మీ ముఖంలో వచ్చే గ్లోని చూసి మీరే షాక్ అవుతారు.

**అలోవెరా జెల్:**

కలబంద కూడా స్కిన్ సమస్యలను దూరం చేస్తుంది. ఇందులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్లు.. చర్మానికి తేమను అందించి.. కాంతివంతం చేస్తుంది. కొద్దిగా కలబంద రాత్రిపూట ముఖానికి రాసి అరగంట సేపు తర్వాత సాధారణ నీటితో కడగాలి. ఇలా చేస్తే.. మరి రిజల్ట్ ఉంటుంది.

**కొబ్బరి నూనె:**

అందరికీ అందుబాటులో దొరికే వాటిల్లో కొబ్బరి నూనె కూడా ఒకటి. కొబ్బరి నూనె చర్మాన్ని హైడ్రేట్‌గా ఉంచి, మంచి గ్లోని ఇస్తుంది. కొద్దిగా కొబ్బరి నూనె తీసుకుని ముఖం, కాళ్లు, చేతులకు రాయండి. ఇలా తరచూ చేస్తే.. ఫేస్‌లో మంచి గ్లో వస్తుంది. అలాగే ఆలివ్ ఆయిల్, వెన్న, నెయ్యి వంటివి కూడా రాసుకోవచ్చు. ఆయిలీ స్కిన్ ఉన్నవాళ్లు వీటికి దూరంగా ఉండండి.

# గుడ్లను వీటితో కలిపి తింటే డేంజర్ బెల్స్ మోగినట్లే.. జాగ్రత్త!



తొలిఅడుగు, ఆరోగ్యం :ఫుడ్ కాంబోస్ అంటే చాలా మంది ఇష్టంగా తింటూ ఉంటారు. అయితే కొన్ని రకాల ఫుడ్ కాంబినేషన్స్ జోలికి వెళ్లకుండా ఉంటేనే చాలా మంచిది. ఇలా పెద్ద లిస్టే ఉంది. ఇంతకు కొన్ని రకాల ఫుడ్ కాంబినేషన్స్ గురించి తెలుసుకున్నాం. ఇప్పుడు గుడ్డును కొన్ని రకాల ఆహారాలతో కలిపి అస్సలు తినకూడదు. ఇలా తినడం వల్ల అనేక అనారోగ్య సమస్యలు రావచ్చు. శరీర ఆరోగ్యానికి కావాల్సిన పదార్థాల్లో గుడ్లు కూడా ఒకటి. ప్రతి రోజూ ఉడక బెట్టిన గుడ్డు ఒక్కటి తిన్నా ఆరోగ్యానికి చాలా మంచిది. ఇందులో అనేక రకాల పోషకాలు లభిస్తాయి. శరీరాన్ని యాక్టీవ్‌గా ఉంచడంలో కూడా గుడ్లు హెల్ప్ చేస్తాయి. గుడ్లలో విటమిన్లు, ప్రోటీన్, ఫైబర్, ఫ్యాటీ యాసిడ్స్, ఖనిజాలు లభిస్తాయి. పిల్లలకు పెట్టాల్సిన ముఖ్యమైన పోషకాల్లో గుడ్లు కూడా ఒకటి. గుడ్డును ఎలా తీసుకున్నా పోషకాలు అందుతాయి. కానీ కొన్ని రకాల ఆహారాలతో పాటు కలిపి తింటే సమస్యలు తప్పవని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. మరి అవేంటో ఇప్పుడు చూసేయండి.

**టీ – ఎగ్:**

ఎగ్స్‌తో ఎన్నో రకాల స్నాక్స్ తాయరు చేస్తూ ఉంటారు. దీంతో చాలా టీతో పాటు ఈ స్నాక్స్ తింటూ ఎంజాయ్ చేస్తారు. కానీ టీతో ఎలాంటి ఆహార పదార్థాలు తీసుకోకూడదని ముఖ్యంగా గుడ్డుతో చేసిన ఆహారాలు తింటే అనేక సమస్యలు వస్తాయని వైద్యులు చెబుతున్నారు. టీతో పాటు గుడ్లు తింటే శరీరంల ఐరన్‌ను శోషించుకోలేదు. జీర్ణ సమస్యల కూడా రావచ్చు.

**సోయా మిల్క్ – గుడ్లు:**

సోయా మిల్క్‌తో పాటు కూడా గుడ్లను తినకూడదు. సోయా మిల్క్ తీసుకోవడం ఆరోగ్యానికి మంచిదే. కానీ గుడ్తో తింటే మాత్రం.. రెండింటిలో ఉండే ప్రోటీన్లు జీర్ణం అయ్యేందుకు సమస్య ఏర్పడుతుంది. పోషకాలు కూడా శరీరానికి సరిగా అందవు. గ్యాస్, అజీర్తి, మల బద్ధకం అనేక జీర్ణ సమస్యలు వస్తాయి.

**చేపలు – గుడ్లు:**

సాధారణంగా ఇంట్లో అయినా బయట భోజనాల్లో అయినా చేపలతో పాటు గుడ్లను కూడా వడ్డిస్తూ ఉంటారు. ఇలా తినడం వల్ల అజీర్తి వంటి సమస్యలు రావచ్చు. దీని వల్ల అనేక జీర్ణ సంబంధిత సమస్యలు వస్తాయి.

**పాలు – గుడ్లు:**

పాలు తాగిన వెంటనే కూడా గుడ్లు తినకూడదు. కనీసం ఓ అరగంట లేదా గంట సమయం అయినా తేడా ఉండాలి. దీని వల్ల కూడా ఎసిడిటీ, అజీర్తి, ఇతర జీర్ణ సమస్యలు వస్తాయి. అలాగే చక్కెరతో చేసిన తీపి వస్తువుల, విటమిన్ సీ ఫుడ్స్ తిన్న తర్వాత కూడా గుడ్లు తీసుకోకూడదు.

# మీ పాదాలు, చేతులు మాటి మాటికీ చల్లబడుతున్నాయా? ఇలా ఎందుకు జరుగుతుందో తెలుసా



తొలిఅడుగు, ఆరోగ్యం :చల్లని గాలి ఒంటికి తాకితే ఒక్కసారిగా చేతులు, కాళ్ళలో రక్త ప్రసరణ తగ్గిపోతుంది. అనంతరం కాసేపటికే ఒళ్లు మళ్లీ వేడెక్కుతుంది. ఇలా చల్లని వాతావరణంలో శరీర భాగాలు వేడెక్కుతున్నాయి అంటే అది మంచి ఆరోగ్యం అని అర్థం. అంటే శరీరంలో రక్తప్రసరణ సవ్యంగా సాగుతుందని అర్థం. కానీ చేతులు, కాళ్ళు విపరీతంగా చల్లగా ఉండి, మంచులా చల్లగా మారిపోతే శరీరంలో పలు పోషకాల నిర్దిష్ట లోపానికి సంకేతం అని అర్థం. అసలు చేతులు, కాళ్లు ఎందుకు చల్లగా మారతాయో ఇక్కడ తెలుసుకుందాం..

చల్లని పాదాలకు కారణాలు

చేతులు, కాళ్ళు చల్లగా మారడం వెనుక ఉన్న అతిపెద్ద కారణాలలో ఒకటి వారి రక్త ప్రసరణ సరిగా లేకపోవడం. ఇది రక్త ప్రసరణను తగ్గిస్తుంది. దీని కారణంగా, శరీర ఉష్ణోగ్రత తగ్గడం ప్రారంభమవుతుంది. చల్లటి పాదాలకు మరో ప్రధాన కారణం రక్త ప్రసరణ ఎక్కువ సేపు ఒకే చోట కూర్చోవడం. దీని వల్ల రక్త ప్రసరణ తగ్గి పాదాలు చల్లగా మారతాయి. అంతేకాకుండా, కాళు ్ళ, చేతులు ఎల్లప్పుడూ చల్లగా మారితే కొన్ని రకాల వ్యాధులు దాడి చేస్తాయి.

రక్తహీనతజి

శరీరంలో ఎర్రరక్తకణాలు తగ్గుముఖం పట్టినా పాదాలు చల్లగా మారతాయి. రక్తహీనతతో బాధపడుతున్న రోగి శరీరంలో రక్తం లేకపోవడంతో బాధపడుతున్నాడు. దీని కారణంగా పాదాలు చల్లబడటం ప్రారంభిస్తాయి. అలాగే %దీ%12, ఫోలేట్, ఐరన్ లోపం కారణంగా కూడా పాదాలు చల్లగా మారతాయి. దీర్ఘకాలిక మూత్రపిండ వ్యాధి కారణంగా కూడా పాదాలు చల్లబడతాయి.

# ఈ నీరు అమృతం కన్నా పవర్‌ఫుల్.. ఉదయాన్నే పరగడుపున తాగితే గుట్టయినా కరగాల్సిందే..

తొలిఅడుగు, ఆరోగ్యం :ప్రస్తుత కాలంలో ఎన్నో అనారోగ్య సమస్యలు వెంటాడుతున్నాయి.. వాటికి చెక్ పెట్టేందుకు మంచి జీవనశైలిని అనుసరించడం, ఆరోగ్యకరమైన ఆహారాన్ని తినడం చాలా ముఖ్యం.. అలాంటి ఆహార పదార్థాలలో మెంతులు ఒకటి.. మెంతులను మసాలా దినుసుగా.. భారతీయ గృహాలలో విస్తృతంగా ఉపయోగిస్తారు.. మెంతులతోపాటు.. ప్రజలు మెంతికూరను కొన్నిసార్లు కూరగాయలలో, కొన్నిసార్లు పరాటాలలో కలిపి తింటారు.. ఇంకా మెంతులతో లడ్డూలు కూడా తయారు చేసుకుని తింటారు.. అయితే.. మెంతులు వల్ల కలిగే ప్రయోజనాల గురించి మనలోని కొంత మందికి చాలా తక్కువ తెలుసు. ఆయుర్వేద నిపుణుల అభిప్రాయం ప్రకారం, మెంతులు అనేక రకాల విటమిన్లు, ఖనిజాలను కలిగి ఉంటాయి.. ఇవి శరీరానికి చాలా ఉపయోగకరంగా ఉండటంతోపాటు.. మేలు చేస్తాయి. ఆయుర్వేద నిపుణుల ప్రకారం.. మెంతులు, మెంతికూర సహాయంతో మనం అనేక రకాల వ్యాధులను నయం చేయవచ్చు. మెంతులలో ప్రోటీన్, టోటల్ లిపిడ్, ఎనర్జీ, ఫైబర్, కాల్షియం, ఐరన్, ఫాస్పరస్, పొటాషియం, జింక్, మాంగనీస్, విటమిన్ సి, విటమిన్ బి, సోడియం, కార్బోహైడ్రేట్లు వంటి పోషకాలు ఉంటాయి.

కాబట్టి మెంతి నీరు త్రాగడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు ఏమిటి..? దానిని ఎప్పుడు తాగాలో తెలుసుకోండి..

ఖాళీ కడుపుతో మెంతి నీరు త్రాగడం వల్ల కలిగే ప్రయోజనాలు..

శరీరాన్ని డిటాక్సిఫై చేస్తుంది: మెంతి నీరు శరీరాన్ని నిర్విషీకరణ చేస్తుంది. ఈ నీటిని తాగడం వల్ల శరీరంలో చక్కెర స్థాయి అదుపులో ఉంటుంది. రోజూ ఉదయాన్నే మెంతికూర నీరు తాగడం వల్ల శరీరం ఆరోగ్యంగా ఉంటుంది.

జీర్ణవ్యవస్థను బలపరుస్తుంది: జీర్ణవ్యవస్థను బలోపేతం చేయడానికి మెంతి నీరు దివ్యౌషధంలా పనిచేస్తుంది. ఇది పొట్టను శుభ్రపరుస్తుంది. ఈ నీటిని తాగడం వల్ల మలబద్ధకం, అసిడిటీ, కడుపు ఉబ్బరం నుంచి ఉపశమనం లభిస్తుంది.

బరువు తగ్గడంలో ప్రభావవంతంగా ఉంటుంది: మెంతులు బరువు తగ్గడంలో ప్రభావవంతంగా పనిచేస్తాయి. నిత్యం మెంతికూర, మెంతి నీళ్లు తాగితే ఊబకాయం త్వరగా తగ్గుతుంది. దీని కోసం ఈ మెంతులను బాగా నమలి తినండి.. దీని ప్రభావం త్వరలోనే కనిపిస్తుంది.

ఆయుర్వేద నిపుణుల అభిప్రాయం ప్రకారం..

మెంతి గింజల నీరు ఆరోగ్యానికి చాలా ఉపయోగకరంగా ఉంటుంది. డయాబెటిస్ లో కూడా మేలు చేస్తుంది. ముఖ్యంగా మీరు దీన్ని ఉదయం ఖాళీ కడుపుతో తాగితే చాలా మంచిది.. మెంతి నీటిని తయారు చేయడానికి ఒక గ్లాసు నీటిలో ఒకటి నుంచి ఒకటిన్నర టీస్పూన్



మెంతి గింజలను రాత్రంతా నానబెట్టండి. ఉదయం నిద్ర లేవగానే ఈ నీటిని బాగా వడపోసి ఖాళీ కడుపుతో తాగాలి. కావాలనుకుంటే మెంతి గింజలను తర్వాత తినవచ్చు. ఉదయాన్నే ఖాళీ కడుపుతో మెంతి నీరు తాగడం వల్ల శరీరంలోని టాక్సిన్స్ బయటకు వెళ్లిపోతాయి. మెంతులు వేడిగా ఉంటాయి.. కాబట్టి గర్భిణీ స్త్రీలు వైద్య సలహా మీద మాత్రమే దానిని తీసుకోవాలి..

# కంటెంట్‌ను నమ్మి చేశాం



తొలిఅడుగు, సినిమా : వెన్నెలకిశోర్ టైటిల్‌రోల్ పోషించిన చిత్రం 'శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్'. అనన్య నాగళ్ల, సియా గౌతమ్ కీలక పాత్రధారులు. రైటర్ మోహన్ దర్శకుడు. వెన్నపూస రమణారెడ్డి నిర్మాత. వంశీ నందిపాటి ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నారు. ఈ నెల 25న సినిమా విడుదల కానుంది. ఈ సినిమా ప్రీరిలీజ్ ఈవెంట్‌ని సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించారు. దర్శకులు కె.ఎస్.రవీంద్ర(బాబీ), కల్యాణ్‌కృష్ణ ఈ కార్యక్రమానికి అతిథులుగా విచ్చేసి చిత్ర యూనిట్‌కు శుభాకాంక్షలు అందించారు. పనిచేసిన అందరికీ మంచి పేరు తెచ్చే సినిమా ఇదని దర్శకుడు రైటర్ మోహన్ అన్నారు. కంటెంట్ మీద ఉన్న నమ్మకంతో ఈ సినిమాను విడుదల చేస్తున్నానని, ఈ సినిమా చూసి నచ్చలేదని అంటే తన నెంబర్‌కు సంప్రదించవచ్చని, సినిమా విజయంపై అంత కాన్ఫిడెంట్‌గా ఉన్నామని వంశీ నందిపాటి తెలిపారు. కథ మీద నమ్మకంతో ఉన్నామని, సినిమాలోని అన్ని అంశాలు కొత్తగా అనిపిస్తాయని, తప్పకుండా హిట్ కొడతామని నిర్మాత తెలిపారు. తన కెరీర్‌లో ప్రత్యేకమైన చిత్రమిదని కథానాయిక అనన్య నాగళ్ల తెలిపింది. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ మాట్లాడారు.

# ఎవరికోసం ఈ విరహ వేదన

తొలిఅడుగు, సినిమా :విభిన్నమైన కథలను ఎంచుకుంటూ హీరోగా తనకంటూ ఓ మంచి గుర్తింపు తెచ్చుకున్నారు నిఖిల్. ఆయన హీరోగా నటిస్తున్న చిత్రం 'ది ఇండియా హౌస్'. సాయి మంజ్రేకర్ కథానాయిక. రామ్‌వంశీకృష్ణ దర్శకత్వంలో అభిషేక్ అగర్వాల్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి అగ్ర హీరో రామ్‌చరణ్, విక్రమ్‌రెడ్డి.వి భాగస్తులుగా ఉన్నారు. ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతున్నది. మంగళవారం సాయి మంజ్రేకర్ పుట్టిన రోజు సందర్భంగా, ఇందులో ఆమె పోషిస్తున్న 'సతి' పాత్రను పరిచయం చేస్తూ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. సంప్రదాయ చీరకట్టులో ప్రియుడి గురించి ఆలోచిస్తూ విరహ వేదన అనుభవిస్తున్నట్టుగా ఈ లుక్‌లో సాయి మంజ్రేకర్ కనిపిస్తున్నది. 1905లో జరిగే పీరియడ్ డ్రామాగా ఈ సినిమా తెరకెక్కుతున్నదని, ప్రేమ, విప్లవం నేపథ్యం ఈ సినిమా కథ ఉంటుందని మేకర్స్ తెలిపారు. అనుపమ్‌ఖేర్ కీలక పాత్ర పోషిస్తున్న ఈ చిత్రానికి సహనిర్మాత: మయాంక్ సింఘానియా, సమర్పణ: రామ్‌చరణ్, నిర్మాణం: అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్, వి మెగా పిక్చర్స్.





# వలసదారుల పీరియాడిక్ డ్రామా






తొలిఅడుగు, సినిమా :ఎన్టీఆర్ కథానాయకుడిగా ప్రశాంత్‌నీల్ దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. దీనికి 'డ్రాగన్' అనే పేరు పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. ఆగస్ట్‌లో ఈ సినిమా లాంఛనంగా ప్రారంభమైంది. ఫిబ్రవరిలో రెగ్యులర్ షూటింగ్ మొదలుకానుంది. తాజా ఇంటర్వ్యూలో ఈ సినిమా కథ గురించి ఆసక్తికరమైన విషయాలను వెల్లడించారు దర్శకుడు ప్రశాంత్‌నీల్. పీరియాడిక్ కథాంశంలో ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నామని, ఇందులో బంగ్లాదేశ్‌లో కష్టాలు అనుభవిస్తున్న తెలుగు వలసదారులను రక్షించే పోరాట యోధుడిగా ఎన్టీఆర్ అత్యంత శక్తివంతమైన పాత్రలో కనిపిస్తారని, ఇంటెన్స్ యాక్షన్ థ్రిల్లర్‌గా ప్రేక్షకుల్ని మెప్పిస్తుందని తెలిపారు. సోషల్‌మీడియాలో ప్రచారం జరుగుతున్నట్లు మైథలాజికల్ టచ్ ఉన్న యాక్షన్ సినిమా కాదని ప్రశాంత్‌నీల్ స్పష్టతనిచ్చారు. ఈ సినిమాలో కన్నడ భామ రుక్మిణి వసంత్ కథానాయికగా నటించే అవకాశముందని వార్తలొస్తున్నాయి. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. ప్రస్తుతం హిందీ మల్టీస్టారర్ 'వార్-2'తో బిజీగా ఉన్నారు ఎన్టీఆర్. ఈ సినిమా అనంతరం ఆయన 'డ్రాగన్' షూట్‌లో జాయిన్ అవుతారు.

# బరోజ్ త్రీడీ.. ఓ కొత్త ప్రపంచం

తొలిఅడుగు, సినిమా :మలయాళ అగ్ర నటుడు మోహన్‌లాల్ టైటిల్ రోల్‌ని పోషిస్తూ స్వీయ దర్శకత్వంలో రూపొందించిన ఫాంటసీ అడ్వెంచర్ చిత్రం 'బరోజ్ 3డీ'. ఆంటోని పెరుంబవూర్ నిర్మాత. ఈ సినిమా నేడు ప్రేక్షకుల ముందుకురానుంది. మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ తెలుగులో విడుదల చేస్తున్నది. మంగళవారం ప్రీరిలీజ్ వేడుకను నిర్వహించారు. ఈ సందర్భంగా మోహన్‌లాల్ మాట్లాడుతూ 'నేటివ్ త్రీడీలో తీసిన సినిమా ఇది. గత 40 ఏండ్లుగా ఈ ఫార్మాట్‌లో సినిమాను ఎవరూ ప్రయత్నించలేదు. మనలోని బాల్యాన్ని సెలబ్రేట్ చేసిన సినిమా. స్టోరీ టెల్లింగ్ చాలా కొత్తగా ఉంటుంది. బాల మేధావి లిడియన్ నాదస్వరం ఈ సినిమాకు సంగీతాన్నందించాడు. అందరూ ఫ్యామిలీతో కలిసి ఆనందించే చిత్రమవుతుంది' అన్నారు. త్రీడీ, యానిమేషన్స్, వీఎఫ్ఎక్స్.. ఇలా అన్ని విభాగాల్లో సినిమా అత్యున్నతంగా ఉంటుందని క్రియేటివ్ హెడ్ టీకే రాజీవ్ కుమార్ తెలిపారు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాత రవిశంకర్ మాట్లాడుతూ 'కేరళ వెళ్లినప్పుడు మోహన్‌లాల్‌గారు ఈ సినిమాలో చూపించిన సాంగ్స్, విజువల్స్ అద్భుతంగా అనిపించాయి. సాంకేతికంగా చాలా ఉన్నతంగా ఉంటుంది. ప్రేక్షకులకు సరికొత్త ప్రపంచంలోకి తీసుకెళ్తుంది' అన్నారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.

